క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక



వైఎస్సార్‌సీపీ అధినేతతో జెడ్పీటీసీ కుటుంబం

దెందులూరు: వైఎస్సార్‌సీపీ అధినేత, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం తాడేపల్లి నివాసంలో దెందులూరు జెడ్పీటీసీ, జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ కమిటీ మెంబర్ నిట్టా లీలా నవ కాంతం గంగరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. దెందులూరు మండలంలో కూటమి ప్రభుత్వం వేధింపులు అక్రమ కేసులు, దాడులు, దౌర్జన్యాలపై వివరించారు. ధైర్యంగా ఉండాలని బాధితులకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందన్నారు. కుమార్తె అన్నశ్రీ,, కుమారుడు ఆన్సన్ గాంధీలను వైఎస్ జగన్‌కు పరిచయం చేశారు.

స్టాక్ బోర్డులు ఏర్పాటు చేయాలి



రేషన్ డీలర్లతో మాట్లాడుతున్న తహసీల్దార్

దెందులూరు: రేషన్ డీలర్లు షాపుల వద్ద పని చేసే వేళలు, స్టాక్ వివరాలతో బోర్డులను ఏర్పాటు చేయాలని తహసీల్దార్ బి.సుమతి ఆదేశించారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని అన్ని రేషన్ షాప్ డీలర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. 65 సంవత్సరాలపైబడిన వృద్ధులకు, వికలాంగులకు ప్రతి నెలా 5వ తేదీ లోపు లబ్ధిదారుల ఇంటికి వెళ్లి డీలర్లు సరుకులు పంపిణీ చేయాలన్నారు. రేషన్ షాపుల వద్ద పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ధరల పట్టిక, ఫోన్ నంబర్ విధిగా ఏర్పాటు చేయాలని సూచించారు. రేషన్ షాపులపై ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా విచారణ యంత్రాంగం చర్యలు తీసుకుంటుందన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్లు శ్రీనివాస్, కృష్ణ స్వామి, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

పోతునూరు కార్యదర్శి షరీఫ్ బదిలీ

దెందులూరు: పోతునూరు గ్రామ పంచాయతీ గ్రేడ్ వన్ కార్యదర్శి షరీఫ్ బదిలీ అయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన ఉంగుటూరు మండలం రావిపాడు పంచాయతీ కార్యదర్శిగా బదిలీపై వెళ్లారు.

మొదలైన వరి నాట్లు



బాదంపూడి ఆయకట్టులో వేసిన వరి నాట్లు

ఉంగుటూరు: మండలంలో వరి నాట్లు మొదలు పెట్టారు. ఎంటీయూ 1318 రకం, స్వర్ణ, సంపద స్వర్ణ రకాలు వేస్తున్నారు. బాదంపూడి, వెల్లమిల్లి, నాచుగుంట ఆయకట్టులో మెట్ట ప్రాంత బోర్ల కింద సాగు రైతులు నాట్లు వేయడం మొదలుపెట్టారు. జిల్లాలో వరి అధిక విస్తీర్ణం ఉంగుటూరు మండలమేనన్న విషయం తెల్సిందే. ఈ నేపథ్యంలో 20 రోజుల క్రితమే బోర్ల కింద రైతులు నారు మళ్లు వేశారు. డెల్టా ఆయకట్టులో నారుమళ్ల పెంపకంపై రైతులు దృష్టి పెట్టారు. ఏలూరు కాలువకు నీరు రావడంతో బోదుల్లో నీరు పారుతోంది. ఈ క్రమంలో నారమళ్లు కొందరు ఇప్పటికే పూర్తి చేశారు. మరి కొందరు రైతులు వేస్తున్నారు.

మార్కెటింగ్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా శ్రీనివాస్



దెందులూరు: మార్కెటింగ్‌శాఖ ఏలూరు అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఎండీవీ శ్రీనివాస్ నియామితులయ్యారు. ఆయన ఇప్పటి వరకు దెందులూరు ఏఎంసీలో సెక్రెటరీగా పని చేశారు. శ్రీనివాస్ స్థానంలో పి.నాగరాజును సెక్రటరీగా మార్కెటింగ్ శాఖ అధికారులు నియమించారు.

ప్రతి ఒక్కరూ దేశభక్తితో మెలగాలి



వికసిత్ భారత్ ప్రతిజ్ఞ చేస్తున్న నాయకులు

పెదపాడు: ప్రతి ఒక్కరూ దేశ భక్తితో మెలగి, ఓటు హక్కును వినియోగించుకోవాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి తెలిపారు. పెదపాడు మండలంలోని వసంతవాడ గ్రామంలో వికసిత్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 11 ఏళ్లలో దేశానికి అందించిన ప్రగతిని ప్రజలకు వివరించారు. తొలుత ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి విక్రం కిశోర్, జిల్లా ఇన్‌చార్జి నెక్కంటి శ్రీనివాసరావు, నాయకులు గుమ్మడి చైతన్య, పామర్తి చిన రంగారావు, బొత్సశేఖర్, కడగంచి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల కలవరం

- అస్తవ్యస్తంగా డ్రెయినేజీ వ్యవస్థ
- పారని మురుగు.. తిష్ట వేసిన పారిశుధ్యం
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యాధికారులు



వేగివాడలో ఖాళీ స్థలంలో చేరిన మురుగు నీరు



అస్తవ్యస్తంగా ఉన్న డ్రెయినేజీ

పెదవేగి: తొలకరి తీసుకొచ్చిన చల్లని కబురుతో పాటు నియోజకవర్గ ప్రజలను సీజనల్ వ్యాధులు కలవరపెడుతున్నాయి. ఇళ్లలోని మురుగు నీరు పారుదలయ్యే అవకాశం లేని పల్లపు, శివారు ప్రాంతాల్లో జన జీవనం అస్తవ్యస్తమవుతోంది. ప్రధాన, కచ్చా, పక్కా డ్రెయిన్లు సక్రమంగా లేకపోవడంతో నీరు పారుదల కాని దృశ్యాలు ఎక్కడపడితే అక్కడ దర్శనమిస్తున్నాయి. పెరిగిన దోమల ఉత్పత్తి కారణంగా రోగాల పాలయ్యే వారు కొందరైతే. మరి కొందరు సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారు.

కొంప ముంచుతున్న ఖాళీ స్థలాలు

నియోజకవర్గ పరిధిలోని పలు వార్డులతో పాటు, మండల పరిధిలోని గ్రామాల్లో ఉన్న ఖాళీ స్థలాలు రోగాలను ఉత్పత్తిచేసే కేంద్రాలుగా తయారయ్యాయి. లోతట్టు స్థలాల్లో నీరు నిలిచిపోవడంతో సమీపంలోని ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. మండలపరిధిలోని గార్లమడుగు, వేగివాడ, కవ్వగుంట, పినకడిమి, కూచింపూడి, వంగూరు, గ్రామాల్లో ఈ సమస్య తీవ్రంగా కనిపిస్తుంది. అదే విధంగా మండల పరిధిలోని ప్రధాన రహదారిపై నిలుస్తున్న నీరు ఆ ప్రాంత ప్రజలను కష్టాల పాలు చేస్తుంది. కె.కన్నాపురం, నడిపల్లి, నాగన్నగూడెం, వేగివాడ, చక్రాయిగూడెం గ్రామాల్లోని పక్కా డ్రెయిన్ల అస్తవ్యస్త తీరు అధికారుల చిత్తశుద్ధిని వెక్కిరిస్తున్నాయి.

విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు

మండల పరిధిలోని పెదవేగి ప్రాథమిక వైద్యశాలలో రెండురోజులుగా పెరుగుతూ వస్తున్న రోగుల సంఖ్య సీజనల్ వ్యాధుల ప్రభావాన్ని స్పష్టం చేస్తున్నాయి. పెదవేగి పీహెచ్‌సీలో రోజుకు 74 మంది, దెందులూరు కస్టర్‌లో 160 నుంచి 200 లోపు, పెదపాడులో 83మంది రోగులు చికిత్స పొందుతున్నారు. ఇవేకాకుండా మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఉన్న ఆర్ఎంపీ డాక్టర్లను రోజుకు 500 మంది వరకు రోగులు సంప్రదిస్తున్నట్లు సమాచారం.

దోమలు విపరీతంగా పెరిగాయి

ఇటీవల కాలంలో దోమలు ఎక్కువయ్యాయి. ఇళ్ల వద్ద మురుగు నీరు పారుదలయ్యేందుకు డ్రెయిన్లు లేకపోవడంతో నిల్వ ఉన్న నీటిలో దోమలు పెరిగిపోతున్నాయి. మురుగు, చెత్తాచెదారంతో దుర్వాసన వెదజల్లుతూ, రాత్రి పగలూ తేడా లేకుండా దాడి చేస్తున్నాయి. దోమల కారణంగానే జబ్బులు వస్తున్నాయి. – సికా లక్ష్మణ్, గ్రామస్తుడు, పినకడిమి

అప్రమత్తంగా ఉండాలి

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు, నిల్వ ఉన్న ఆహార పదార్థాలను తీసుకోకూడదు. నివాస ప్రాంతాల్లో నిల్వ ఉన్న నీటిని సాధ్యమైనంత వరకు బయటకు పంపేందుకు చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా చిన్నారుల ఆరోగ్యం పట్ల ఎక్కువ శ్రద్ధ తీసుకోవాలి. – మాధవి, పీహెచ్‌సీ వైద్యాధికారి, పెదవేగి

సిస్టర్‌గా సౌభాగ్య నియామకం



దెందులూరు: తల్లిదండ్రుల ప్రోత్సాహం, కృషితో ఆధ్యాత్మిక సేవలు అందించేందుకు సిస్టర్‌గా నియమింపబడ్డానని రెవరెండ్ సిస్టర్ కొల్లా బత్తుల సౌభాగ్య అన్నారు. దెందులూరు గ్రామానికి చెందిన కొల్లాబత్తుల ప్రసాద్, మరియమ్మ దంపతుల కుమార్తె ఎమ్మెస్ ఎంఎండీ నామినేషన్ రెవరెండ్ సిస్టర్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆమెకు ఫాదర్లు అమ్మన్ రాజా, కళ్యాణ్ గ్రామస్తులు ఆర్‌సీఎం సంఘస్తులు స్వాగతం పలికారు.

మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నేతల అభినందన

బ్రదర్ అండ్ సిస్టర్‌గా నియమితులైన సౌభాగ్య వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత సొసైటీ మాజీ డైరెక్టర్ మొటపర్తి రాంబాబు, గ్రామ మాజీ సర్పంచ్ మొటపర్తి సాయి కుమారి అభినందించారు.

రీసర్వే డ్రాఫ్ట్ ల్యాండ్ రిజిస్టర్ ప్రచురణ

దెందులూరు: పైలెట్ ప్రాజెక్టు గ్రామమైన మలకచర్ల భూ రీసర్వే కార్యక్రమం పూర్తయిందని తహసీల్దార్ బి.సుమతి అన్నారు. మలకచర్ల గ్రామంలో బుధవారం గ్రామ రైతులకు రీసర్వే డీఎల్ఆర్ (డ్రాఫ్ట్ ల్యాండ్ రిజిస్టర్)ను ప్రచురణ చేసి, ఎల్‌పీ నంబర్ వారీగా రైతుల వారీగా, విస్తీర్ణం వారీగా గ్రామ రైతులకు చదివి వినిపించారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కోరారు. సమావేశంలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ రవిచంద్ర, మండల సర్వేయర్ రమణారావు, ఆర్ఐ హేమమాలిని, వీఆర్వో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ప్రజాదరణ గల నేత వైఎస్ జగన్

భీమడోలు: ప్రజాదరణ గల నేత, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను కూటమి ప్రభుత్వం ఆంక్షలతో అడ్డుకోవాలని పలు ప్రయత్నాలు చేసిందని రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ సెల్ కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్ అన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా జన సందోహం నడుమ రెంటపాళ్ల పర్యటన విజయవంతమైందని ఆయన తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటనను విడుదల చేశారు. పోలీసుల ఆంక్షలతో ఎన్ని బారికేడ్లు పెట్టినా ప్రజలు వాగులు, వంకలు, పుట్టలు, చేల మధ్య నుంచి వచ్చారన్నారు. రోడ్లన్నీ జన సంద్రంగా మారాయని తెలిపారు. జగనన్న పర్యటనను నిలువరించేందుకు 25 చెక్ పోస్టులు పెట్టినా ఆయన అభిమానులను ఆపలేకపోయారని పేర్కొన్నారు. పులివెందుల ఎమ్మెల్యేపై ప్రజలు చూపుతున్న అభిమానానికి కూటమి ప్రభుత్వం షాక్‌కు గురవుతుందన్నారు. సూపర్ సిక్స్ పథకాలు ఏమీ చేయలేదని, తల్లికి వందనం అరకొరగా చేశారన్నారు. జగనన్న అంటే నమ్మకం, చంద్రబాబు అంటే మోసం అని ప్రజలు గమనించారని, వచ్చే ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెప్తారని ఆయన విమర్శించారు.

జ్వరం వస్తే రక్త పరీక్షలు చేయించుకోవాలి



పీహెచ్‌సీలో మలేరియా అవగాహన సదస్సు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

గణపవరం: జ్వరం వస్తే నిర్లక్ష్యం చేయకుండా తప్పనిసరిగా రక్త పరీక్షలు చేయించుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి ఓంకార్‌నాథ్ అన్నారు. బుధవారం గణపవరం పీహెచ్‌సీలో మలేరియా వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా సిబ్బంది మలేరియా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఓంకార్‌నాథ్ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం పొడి వారంగా పాటించాలని, ఇంటి పరిసరాల్లో మురుగు నీరు, తడి లేకుండా పొడిగా ఉంచుకుంటే దోమల వ్యాప్తి తగ్గుతుందన్నారు. దోమలద్వారా మలేరియా, డెంగీ వ్యాధులు వ్యాపిస్తాయన్నారు. అనంతరం గ్రామంలో ప్రదర్శన నిర్వహించి, మలేరియాపై ప్రజలకు అవగాహన కల్పించారు. సీహెచ్‌వో జాలాది విల్సన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గుర్రపు డెక్కను తొలగించరూ..



కాలువలో పేరుకుపోయిన గుర్రపు డెక్క

ఉంగుటూరు: అసలే మెరక భూములు ఆపైన పేరుకుపోయిన గుర్రపు డెక్క, దీంతో నీరు ప్రవాహానికి అడ్డంకిగా తయారైంది. భూములకు నీరు చేరటం గగనంగా మారింది. ఈ క్రమంలో కూటమి నాయకులు ఈ ఏడాది తవ్వ చేయలేకపోయారు. దీనికి తోడు రైతులకు గోరు చుట్టుపై రోకటి పోటు అన్న చందంగా గుర్రపు డెక్క పైనుంచి కొట్టుకొచ్చి ప్రవాహ వేగాన్ని అవరోధం కల్పిస్తుంది. ఈ పరిస్థితి రైతులకు సాగు నీటికి ఇబ్బంది ఏర్పడనుంది. ఉంగుటూరు, నాచుగుంట, నారాయణపురం, తల్లాపురం, కైకరం బ్రిడ్జిలు పిల్లర్ల వద్ద గుర్రపు డెక్క 50 నుంచి వంద మీటర్ల పొడవు నిలిచిపోయింది. గుర్రపు డెక్కను తొలగించే పనులు ఏవీ నీటి సంఘాలు గాని, ఇరిగేషన్ అధికారులు గాని చేపట్టలేదు. వెంటనే గుర్రపు డెక్కను తొలగించాలని రైతులు కోరుతున్నారు.

మంత్రి నిమ్మల వ్యాఖ్యలు దుర్మార్గం



అప్పన కనకదుర్గా ప్రసాద్

పెదపాడు: సత్తెనపల్లి పర్యటనలో జరిగిన ఘటనను వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ఆపాదించి మాట్లాడటం మంత్రి నిమ్మలకు తగదని దెందులూరు ఏఎంసీ మాజీ చైర్మన్ అప్పన కనకదుర్గా ప్రసాద్ అన్నారు. జరిగిన విషయంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఎలాంటి సంబంధం లేదని ఆ జిల్లా ఎస్పీ ప్రకటన చేశారని ఆయన తెలిపారు. కనీస పరిజ్ఞానం లేకుండా, విషయం తెలుసుకోకుండా దుర్మార్గంగా దుష్ప్రచారం చేయడం మంత్రికి తగదన్నారు. గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అనేక సంఘటనల్లో పలువురు చనిపోయారని అప్పుడు నిమ్మల ఎందుకు స్పందించలేదని నిలదీశారు. చంద్రబాబు మెప్పు కోసం, మంత్రి పదవి నిలబెట్టుకోవడానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అసత్య ప్రచారం చేయడానికి చిన్నతనంగా, సిగ్గుగా అనిపించలేదా అని మంత్రిని అప్పన ప్రసాద్ ఎద్దేవా చేశారు.

మెరుగైన ఫలితాలు సాధించాలి

లింగపాలెం: వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ మెరుగైన ఫలితాలు సాధించాలని రైతులకు మండల వ్యవసాయ అధికారి వి.ప్రదీప్‌కుమార్ సూచించారు. మండలంలోని రంగాపురం, భోగోలు గ్రామాల్లో నిర్వ హించిన పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. భూసార పరీక్షల ప్రాముఖ్యత, పచ్చిరొట్ట పైర్లు వల్ల ఉపయోగాలు, కౌలు రైతులకు కౌలు కార్డుల ఉపయోగాన్ని వివరించారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న పోలీసులు

ఏలూరు టౌన్: ఏలూరు రూరల్ పోణంగి గ్రామంలో ఒక బాలిక వివాహాన్ని పోలీసులు అడ్డుకున్నారు. పోణంగికి చెందిన యువకుడి (20)కి బాలిక (17)కు బుధవారం వివాహం చేసేందుకు పెద్దలు సిద్ధంకాగా, ఏలూరు రూరల్ ఏఎస్సై స్వామి తన సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి అడ్డుకున్నారు. ఇరు కుటుంబాల పెద్దలను పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చారు.

అంకిత భావమే శ్రీరామరక్ష



బదిలీపై వెళుతున్న సిబ్బందిని సన్మానిస్తున్న ఏఎంసీ కార్యదర్శి

దెందులూరు: ఏ రంగంలోనైనా అంకిత భావమే శ్రీరామరక్ష అని నిబంధనల ప్రకారం విధులు నిర్వహిస్తే గుర్తింపు అదే వస్తుందని ఏఎంసీ కార్యదర్శి పి.నాగరాజు అన్నారు. దెందులూరు ఏఎంసీ కార్యదర్శిగా పని చేసిన ఎండీవీ శ్రీనివాస్ సూపర్ వైజర్‌గా పని చేసిన వి.గౌతమ్, అసిస్టెంట్ సెక్రటరీగా పని చేసిన గౌరీ శంకర్ బదిలీపై వెళుతున్న సందర్భంగా ముగ్గురికీ సన్మానం నిర్వహించారు. కార్యక్రమంలో సీతారామంజనేయ నిమ్మకాయల వర్తక సంఘం అధ్యక్షుడు ఆలపాటి రంగారావు, డైరెక్టర్ దయానందరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎంసీ కార్యదర్శిగా నాగరాజు

దెందులూరు: దెందులూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఏఎంసీ ఇన్‌చార్జి కార్యదర్శిగా పి.నాగరాజు నియమితులయ్యారు. వ్యవసాయ మార్కెట్ కమిటీల సమస్యల పరిష్కారానికి, రైతుల వ్యాపార అభివృద్ధికి అందరి సహకారాలతో కృషి చేస్తానని కార్యదర్శి నాగరాజు అన్నారు.

ఏఎంసీ చైర్మెన్‌గా కారేటి జ్యోతి

ఉంగుటూరు: ఉంగుటూరు మార్కెట్ కమిటీ చైర్మెన్‌గా కారేటి జ్యోతి, మరికొందరు డైరెక్టర్లుగా బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. చేబ్రోలు మార్కెట్ కమిటీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు హాజరయ్యారు. ఏఎంసీ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

భీమడోలు: భీమడోలు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఆగడాలలంక, ఎం.నాగులపల్లి, సర్వారాయ షుగర్స్ ఫీడర్ల మిడిల్ పోల్ లైన్ పనులు చేపట్టనున్నట్లు ఆ శాఖ ఏడీఈ కె.గోపాలకృష్ణ అన్నారు. మరమ్మతుల నిమిత్తం ఈ నెల 20వ తేదీ శుక్రవారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు భీమడోలు మండలంలోని పలు గ్రామాల్లో, ఎం.నాగులపల్లి, సూరప్పగూడెం కేవీ సబ్‌స్టేషన్ల పరిధిలో భీమడోలు బస్టాండ్, పోలసానిపల్లి, సూరప్పగూడెం అగ్రి కల్చరల్ ఫీడర్ల పరిసర గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఆయన తెలిపారు. గుణ్ణంపల్లి సబ్‌స్టేషన్‌లో అత్యవసర పనుల నిమిత్తం గుణ్ణంపల్లి, మారంపల్లి, రాజుపాలెం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామన్నారు. అదే విధంగా గుణ్ణంపల్లి, సత్తాల ఫీడర్లలో పనుల్లో భాగంగా ఈ నెల 19వ తేదీ నుంచి 30వ తేదీ వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆయన తెలిపారు.

జానంపేట సబ్‌స్టేషన్ పరిధిలో

పెదవేగి: మండలంలోని విజయరాయి సెక్షన్ జానంపేట సబ్ స్టేషన్ పరిధిలో జానంపేట , జగన్నాథపురం, సింగవరం, ముత్తనవేడు గ్రామాలకు మరమ్మతుల నిమిత్తం ఈ నెల 20వ తేదీ ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆపరేషన్స్ కేఎం అంబేడ్కర్ తెలిపారు. అలాగే కూచింపూడి సబ్ స్టేషన్ పరిధిలో కూచింపూడి, గోవిందవారిగూడెం, న్యాయంపల్లి గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కావున వినియోగదారులు గమనించి, విద్యుత్ సిబ్బందికి సహకరించవలసినదిగా ఆయన కోరారు.

సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేయాలి



రోడ్ల పరిస్థితిని పరిశీలిస్తున్న అభిషేక్‌బాబు, రైతులు, వర్తకులు

టి.నరసాపురం: గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే సర్వీస్ రోడ్డును మండలంలోని బొర్రంపాలెం గ్రామంలో నిర్మించాలని స్వచ్ఛ సేవా చారిటబుల్ ట్రస్ట్ అధినేత, వైఎస్సార్ సీపీ నాయకులు పెండ్యాల అభిషేక్‌బాబు కోరారు. బుధవారం మండలంలోని బొర్రంపాలెం గ్రామంలో గ్రీన్‌ఫీల్డ్ హైవే ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. గ్రీన్‌ఫీల్డ్ హైవేపైకి వెళ్లేందుకు బొర్రంపాలెం గ్రామం, పరిసర గ్రామాల ప్రజలకు, రైతులు, వర్తకులు సర్వీస్ రోడ్డు సరిగా లేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఎంపీ పుట్ట మహేష్‌యాదవ్, ఎమెల్యే చిర్రి బాలరాజులు ప్రజలు, రైతుల వాణిని కేంద్రంలో గట్టిగా వినిపించి సర్వీస్ రోడ్లు తారు రోడ్లుగా మార్చి ఈ ప్రాంత ప్రజలకు అందించాలని అభిషేక్‌బాబు కోరారు. కార్యక్రమంలో రైతులు, వర్తకులు, ప్రజలు పాల్గొన్నారు.

రోడ్డు ఎత్తు పెంచి డ్రెయిన్ నిర్మించండి



వినతిపత్రం అందిస్తున్న నాసర్ పాషా

టి.నరసాపురం: టి.నరసాపురం ప్రధాన కూడలిలో రోడ్డు ఎత్తు పెంచి, డ్రెయిన్ నిర్మాణం చేపట్టాలని సామాజిక కార్యకర్త ఎస్‌డీ నాసర్ పాషా అన్నారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయంలో ఆయన వినతిపత్రం అందజేశారు. టి.నరసాపురం బందంచర్ల రోడ్డు అంబేడ్కర్ సెంటర్ నుంచి కొద్ది దూరం వరకు వర్షపు నీరు రోడ్డుపై నిలిచిపోతుందన్నారు. రోడ్డు ఎత్తుగా లేకపోవడం, మురుగునీరు వ్యవస్థ లేని కారణంగా వరద నీరు, డ్రెయిన్ నీరు రోడ్డుపై వచ్చి ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారని వివరించారు. అధికారులు స్పందించి, రోడ్డు ఎత్తు పెంచి, డ్రెయిన్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, టి.నరసాపురం యూనియన్ బ్యాంకు వద్ద మెయిన్ రోడ్డుపై వరద నీరు నిలవకుండా చూడాలని కోరారు.

హడలెత్తిస్తున్న వీధి శునకాలు



ఇంటిగుమ్మం ముందు తిష్ట వేసిన వీధి కుక్కలు



అర్ధ రాత్రి వీధుల్లో తిరుగుతున్న శునకాలు

- బయటకు రావాలంటే భయపడిపోతున్న పిల్లలు, వృద్ధులు
- వాహనదారుల వెంటపడి తరుముతున్న వీధి కుక్కలు

గణపవరం: గ్రామాల్లో శునకాల బెడద ఎక్కువైంది. ఏ వీధిలో చూసినా వీధి కుక్కలు రోడ్లపై గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయకంపితులను చేస్తున్నాయి. రోడ్డు మీద వెళ్లే వారిని వెంటపడి తరుముతూ అందితే కరుస్తూ, కండలు పీకుతున్నాయి. పట్ట పగలు కూడా రోడ్డు మీదకు రావాలంటే చేతిలో కర్రో, రాయో, పట్టుకుని రావాల్సిందే. మహిళలు, చిన్న పిల్లలు, వృద్ధులైతే శునకాలు బెదురు లేకుండా మీదకు ఉరుకుతున్నాయి. కాస్త చీకటి పడితే ఒంటరిగా వీధిలోకి రావాలంటేనే జనం హడలి పోతున్నారు. ఇక లేగ దూడలను, పశువులను కూడా వదలడం లేదు. నాటు కోళ్లను సైతం గుటుక్కు మనిపిస్తున్నాయి. అక్కడ, ఇక్కడ అన్న తేడా లేకుండా ఏ గ్రామంలో చూసినా వీధికుక్కల బెడద ఎక్కువైంది. వీటి సంఖ్య ప్రతి సంవత్సరం పెరిగి పోతుండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

330లకు పైగా కుక్క కాటు బాధితులు

గత రెండు మాసాల వ్యవధిలోనే గణపవరం, నిడమర్రు మండలాల్లోని మూడు పీహెచ్‌సీల్లో సుమారు 300 పైగా కుక్కకాటు బాధితులు వైద్యం చేయించుకున్నారు. ఇక ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన వారి సంఖ్య మరో 200 వరకు ఉండొచ్చని అంచనా. గతంలో ఒక్కో గ్రామంలో పదో, పరకో ఊర కుక్కలు ఉండేవి. ప్రస్తుతం ఏ గ్రామంలో చూసినా వందల సంఖ్యలో కుక్కలు కనిపిస్తున్నాయి. ఈ కుక్కలు వీధుల్లో గుంపులుగా తిరుగుతూ మరో కుక్కల గుంపు ఎదురైతే అవి ప్రత్యక్ష యుద్ధానికి దిగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ద్విచక్ర వాహనదారుల వెంట పడటంతో వారు కంగారులో కింద పడి గాయాలపాలైన సంఘటనలు అనేకం ఉన్నాయి. గతంలో పంచాయతీ అధికారులు వీధి కుక్కలను పట్టి సుదూర ప్రాంతాల్లో వదిలి వేసేవారు. అప్పుడు గ్రామాల్లో కుక్కల బెడద అదుపులో ఉండేది. కొన్నేళ్లుగా జంతు ప్రేమికులు న్యాయ స్థానాల్లో కేసులు వేయడంతో కోర్టు ఆదేశాల మేరకు పంచాయతీలు కుక్కల అదుపుపై పంచాయతీలు చర్యలు తీసుకోవడానికి అవకాశం లేకుండా పోయింది. దీంతో గ్రామాలలో కుక్కల సంఖ్య విపరీతంగా పెరిగిపోతుందని అంటున్నారు. కనీసం గ్రామ పంచాయతీలు కుక్కలకు క్రమం తప్పకుండా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేస్తే వీటి బెడద తగ్గుతుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

అందుబాటులో కుక్క కాటు మందు



గణపవరం పీహెచ్‌సీకి నెలకు కనీసం 60, 70 మంది కుక్క కాటు బాధితులు వైద్యం కోసం వస్తుంటారు. పిప్పర పీహెచ్‌సీకి మరో 30 మంది వరకూ కుక్క కాటు బాధితులు వస్తుంటారు. గత నెల రోజులుగా కుక్క కాటు బాధితుల సంఖ్య కొద్దిగా తగ్గినా రోజుకు కనీసం ఇద్దరు, ముగ్గురు వస్తున్నారు. వచ్చిన వారందరికీ వ్యాక్సిన్ ఇస్తున్నాం. పీహెచ్‌సీలో కుక్క కాటుకు అవసరమైన యాంటీ రేబిస్ వాక్సిన్ అందుబాటులో ఉంచుతున్నాం.

– ఓంకార్‌నాథ్, పీహెచ్‌సీ వైద్యాధికారి

వస్త్ర దుకాణంలో అగ్నిప్రమాదం



దేవులపల్లిలో మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

జంగారెడ్డిగూడెం: మండలంలోని దేవులపల్లి గ్రామంలో బుధవారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. బాధితులు, అగ్నిమాపక అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎంఎస్ఎస్ఎన్ పద్మజకు చెందిన వస్త్ర దుకాణంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించి వస్త్రాలన్నీ దగ్ధమయ్యాయి. వెంటనే స్థానికుల నుంచి సమాచారం అందుకున్న ఫైర్ ఆఫీసర్ అబ్రహం సిబ్బందితో కలిసి హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు. అప్పటికే వస్త్ర దుకాణంలో వస్త్రాలు పూర్తిగా ఆహుతయ్యాయి. ఈ ప్రమాదంలో రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లనున్నట్టు ఫైర్ ఆఫీసర్ అబ్రహం తెలిపారు.